RNI NO:APTEL /2023/90201

POST REGD NO :NSV/15/2026-28

రాజధాని

తెలుగు దినపత్రిక

వాయిస్

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగుటకు

గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు

నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు

మండలాల వారిగా విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 361 | 21 శనివారం నవంబర్ 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

ప్రధాని మోదీని కలిసిన ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి

- దేవభూమి ప్రత్యేక ఉత్పత్తులను అందజేసిన ముఖ్యమంత్రి
- మలారి సంప్రదాయ ఉన్ని వస్త్రాలు బహూకరణ బదరీ
- నెయ్యి, హర్సిల్ రాజ్మా, ఎర్ర బియ్యం కానుకగా అందజేత
- హరిద్వార్ కుంభమేళా-2027కు గుర్తుగా గంగమ్మ ప్రతిరూపం



ఏపీఎండీసీని అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దడంపై సీఎం సమీక్ష

- కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపుపై దృష్టి
- ఖనిజ సంపద వినియోగానికి కార్యాచరణ
- ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం

అమరావతి,రాజధాని వాయిస్ : రాష్ట్రంలో ఖనిజ రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, అందుబాటులో ఉన్న సహజ వనరులను సమర్థంగా వినియోగించుకునే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కీలక సమీక్ష నిర్వహించారు. మైనింగ్ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులతో చర్చించిన ఆయన, ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)ను అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సంస్థ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు ఖనిజ రంగంలో రాష్ట్రానికి మరింత ప్రయోజనం చేకూరేలా ప్రణాళికలు సిద్ధం చేయడంపై సమీక్షలో దృష్టి సారించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కొత్త ఖనిజ నిక్షేపాలను గుర్తించడం, వాటి లభ్యతను అంచనా వేయడం,



భవిష్యత్తులో వాటిని ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై ముఖ్యమంత్రి చర్చించారు. ▶▶2

బర్డ్ ఫ్లూకు చెక్ పెట్టేలా స్వదేశీ వ్యాక్సిన్ అందుబాటులోకి!

హెచ్5ఎన్1 వైరస్‌ను ఎదుర్కొనేందుకు భారత్ తొలి టీకా అభివృద్ధి.. భోపాల్‌లో ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్



బర్డ్ ఫ్లూ ముప్పు నుంచి పౌల్ట్రీ రంగాన్ని రక్షించేందుకు భారత్ కీలక ముందడుగు వేసింది. కోళ్లు, ఇతర పక్షుల్లో వేగంగా వ్యాప్తి చెందుతూ తీవ్ర నష్టాలకు కారణమవుతున్న ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (Avian Influenza) వ్యాధిని నియంత్రించే దిశగా దేశీయంగా అభివృద్ధి చేసిన హెచ్5ఎన్1 (H5N1) వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. ఈ స్వదేశీ టీకాను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భోపాల్‌లో ఆవిష్కరించారు. దేశంలోనే తొలిసారిగా అత్యంత వ్యాధికారక బర్డ్ ఫ్లూ వైరస్‌ను ఎదుర్కొనేందుకు ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడం విశేషం.భోపాల్‌లోని ఐసీఏఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ శాస్త్రవేత్తలు ఈ వ్యాక్సిన్‌ను రూపొందించారు. అత్యంత ప్రమాదకరమైన ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌లోని హెచ్5ఎన్1 క్లేడ్ 2.3.2.1ఘ రకాన్ని ఎదుర్కొనే లక్ష్యంతో దీనిని అభివృద్ధి చేశారు. ఈ వైరస్ పౌల్ట్రీ రంగానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్న నేపథ్యంలో స్వదేశీ పరిజ్ఞానంతో వ్యాక్సిన్ తయారు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

వేగంగా వ్యాప్తి చెందే వ్యాధి

బర్డ్ ఫ్లూగా ప్రసిద్ధి చెందిన ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా పక్షులకు సోకే వైరస్ సంబంధిత అంటువ్యాధి. ముఖ్యంగా కోళ్లు, బాతులు, ఇతర పక్షుల్లో ▶▶2

అర్నబ్, మురసు తుపానుల విధ్వంసం..

ఉద్యాన పంటల పునరుద్ధరణకు రూ.96 కోట్ల సాయం కోరిన సీఎం చంద్రబాబు

అమరావతి, రాజధాని వాయిస్ : ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుఫాన్ల ధాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యాన పంటలకు ఏకంగా రూ.1,092 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తీవ్రంగా నష్టపోయిన ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనంగా రూ.96.33 కోట్ల ఆర్థిక సాయం అందించాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు.ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2 తేదీల్లో వరుసగా విరుచుకుపడిన రెండు తుఫాన్ల వల్ల రాష్ట్రంలోని 18 జిల్లాల్లో తీవ్ర విధ్వంసం జరిగిందని చంద్రబాబు వివరించారు. మొత్తం 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 71,576 మంది రైతులు ▶▶2

వైఎస్ అవినాశ్ రెడ్డి కాన్వాయ్‌పై దాడి.. వాహనం ధ్వంసం

- పులివెందుల పరిధిలో ఉద్రిక్తత రాళ్లు, కర్రలు, పెట్రోల్ బాంబులతో దాడి చేశారన్న ఎంపీ
- టీడీపీ నేత బీటెక్ రవిపై అవినాశ్ రెడ్డి ఆరోపణలు
- పోలీసుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎంపీ

అమరావతి,రాజధాని వాయిస్ : కడప జిల్లాలోని పులివెందుల నియోజకవర్గ పరిధిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సింహాద్రిపురం మండలం అంకలమ్మ గూడూరు సమీపంలో వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి కాన్వాయ్‌పై దాడి జరిగినట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్ల ప్రక్రియలో భాగంగా తమ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా వెళ్తున్న ▶▶2



పిఠాపురంకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలి

ఉపాసన సేవా కార్యక్రమంపై ప్రశంసలు.. అంగన్‌వాడీలకూ అపోలో సహకారం అందించాలని ఆకాంక్ష



పిఠాపురం, రాజధాని వాయిస్ : పిఠాపురంలో చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు చేపడుతున్న కార్యక్రమాన్ని ఒక్క నియోజకవర్గానికే పరిమితం చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహార అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమని ఉపాసనపై ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.డబ్బు ఉండటం ఒక్కటే గొప్ప విషయం కాదని, దానిని సమాజానికి ఉపయోగపడే విధంగా ఖర్చు చేసే ఆలోచన, దమ్ము, సరైన విధానం కూడా ఉండాలని పేర్కొంటూ ఉపాసన చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తున్నారు.నేటికీ పౌష్టికాహార లోపం కారణంగా ఐదేళ్లలోపు చిన్నారులను కోల్పోయిన తల్లిదండ్రులు ఎంతోమంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.ప్రభుత్వ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా అపోలో సంస్థ తన వంతు సహకారం అందిస్తే మరింత ప్రయోజనం చేకూరుతుందని సూచిస్తున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీల్లో అందిస్తున్న ఆహార మెనూకు అదనంగా మరింత నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటే చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొంటున్నారు.పిఠాపురంలో ప్రారంభమైన ఈ తరహా కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తే పేద, బలహీన వర్గాల చిన్నారులకు ఎంతో మేలు జరుగుతుందని, పోషకాహార లోపం నివారణలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని ఆకాంక్షిస్తున్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేయాలి

తొలి విడత స్థానిక ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో ముందుకు సాగాలి: ఎమ్మెల్సీ నాగబాబు

తాడేపల్లిగూడెం, రాజధాని వాయిస్ : మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ నాగబాబు సూచించారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు.శుక్రవారం తాడేపల్లిగూడెంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి, కౌన్సిలర్ అభ్యర్థులతో ఎమ్మెల్సీ నాగబాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల కార్యాచరణ, ప్రచార ప్రణాళికలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల తొలి విడతలో సాధించిన విజయాల స్ఫూర్తితో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఎన్నికల్లోనూ ముందుకు సాగాలని అన్నారు.



నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల కార్యాచరణను పక్కా ప్రణాళికతో అమలు చేయాలని, ప్రతి ఒక్కరూ సమష్టి బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు.

'ఈ ప్రభుత్వానికి పాలించే హక్కు లేదు'



విజయనగరం, రాజధాని వాయిస్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నేతలు ప్రజాస్వామ్యానికి పాతరేశారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. ఇప్పుడు చేసిన నీచమైన అరాచకం ప్రజాస్వామ్యంలో ఎప్పుడూ జరగలేదన్నారు. అరాచకంతో వచ్చిన గెలుపును చూసి చంద్రబాబు సంబరపడిపోతున్నారని, అధికార దుర్వినియోగానికి పాల్పడి ప్రజాస్వామ్యాన్ని పాతర వేస్తున్నారని ధ్వజమెత్తారు. 'రాబోయే రోజుల్లో ఏదైనా జరిగితే అది మీరు తీసుకొచ్చిన సంప్రదాయమే కారణం అవుతుంది. ఎంపీపీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీపీ, వైస్ ఎంపిపిలు గెలిచినట్లు ప్రకటించారు. పూసపాటి రేగ మండలంలో మహంతి శ్రీనివాసరావు వైస్ ఎంపిపిగా గెలిచినట్లు ధృవీకరణ పత్రం కూడా ఇచ్చారు. ఎన్నిక అంతా అయిన తరువాత మళ్లీ ఎన్నిక పెట్టారు. ఇదెక్కడి ప్రజాస్వామ్యం. పలుచోట్ల వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేశారు. స్వయంగా ఎమ్మెల్యే లోకం మాధవి, ఆమె భర్త ఎన్నికల అధికారులు పై బెదిరింపులకు దిగారు. రేపు సాయింత్రం నాలుగు గంటలకు గవర్నర్ అపాయింట్‌మెంట్ తీసుకున్నాంజరిగిన అన్ని ఘటనలు గవర్నర్‌కి వివరిస్తాం. ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

'రామాయపట్నం'కు కస్టమ్స్ గుర్తింపు రావడంపై వైఎస్ జగన్ హర్షం

తాడేపల్లి, రాజధాని వాయిస్ : రామాయపట్నం పోర్టుకు కస్టమ్స్ గుర్తింపు రావడంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తమ హయాంలో జరిగిన అభివృద్ధి ఫలిస్తోందంటూ వైఎస్ జగన్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు.'ఏపీ పారిశ్రామిక అభివృద్ధికి పోర్టులే చోదక శక్తులు. పోర్టుల ఆధారిత పారిశ్రామికీకరణే ఏపీకి అతిపెద్ద పెట్టుబడుల ఆకర్షణ. కస్టమ్స్ గుర్తింపు రామాయపట్నం పోర్టుకు కీలక మైలురాయి. దిగుమతులు, ఎగుమతుల కోసం కస్టమ్స్ పోర్టుగా సీబీఐసీ నోటిఫై చేసింది. మా ప్రభుత్వ హయాంలో పోర్టుల నిర్మాణాలను రూపొందించాం. ఏపీలలోని విస్తారమైన తీరప్రాంతాన్ని ఉపయోగించుకుని నాలుగు పోర్టుల అభివృద్ధికి శ్రీకారం చుట్టాం. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టుల నిర్మాణమే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించాం.ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు చొప్పున తీరప్రాంత మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక. 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. పోర్టుల ఆధారంగా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుంది.రామాయపట్నం పోర్టును ప్రధాన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేశాం. రామాయపట్నం పోర్టు పరిసరాల్లో భారీ పెట్టుబడులకు కార్యరూపం దాల్చాయి. బీపీసీఎల్ భారీ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ముందడుగు పడింది.ఇండోసోల్ సోలార్ సమగ్ర తయారీ పరిశ్రమతో పాటు మరిన్ని భారీ పెట్టుబడులకు అవకాశం లభించింది.లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు.. వేలాది ఉద్యోగాలకు మార్గం ఏర్పడింది.భారీ పారిశ్రామిక వ్యవస్థకు పునాది పడింది. దావోస్ నుంచి సీఐఐ సదస్సుల వరకు ప్రస్తుత ప్రభుత్వం ప్రస్తావిస్తున్న పోర్టులు మా ప్రభుత్వ హయాంలో ప్రారంభించినవే. పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు మేము చేపట్టిన పోర్టులనే ప్రస్తుత ప్రభుత్వం చెప్పుకుంటోంది'అని ధ్వజమెత్తారు.



ప్రధాని మోదీని కలిసిన ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి



న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ : ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి శుక్రవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన సంప్రదాయ, స్థానిక ఉత్పత్తులను ప్రధానమంత్రికి బహూకరించారు. దేవభూమి ప్రత్యేకతను ప్రతిబింబించేలా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వస్తువులను కానుకలుగా అందజేశారు. మలారి ప్రాంతానికి ప్రత్యేకమైన సంప్రదాయ చేతితో నేసిన 'పత్తి' వస్త్రంతో పాటు, అక్కడి ఉన్నితో తయారుచేసిన 'డోర్ఖా' దుస్తులను ధామి ప్రధానమంత్రికి అందించారు. ఉత్తరాఖండ్‌లోని సంప్రదాయ చేనేత నైపుణ్యం, స్థానిక జీవనశైలి, పర్వత ప్రాంతాల సంస్కృతిని ప్రతిబింబించే ఈ వస్త్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.రాష్ట్రానికి ప్రత్యేకమైన స్వచ్ఛమైన తేనె, బదరీ నెయ్యి, హర్సిల్ ప్రాంతపు రాజ్మా, ఎర్ర బియ్యాన్ని కూడా ముఖ్యమంత్రి బహూకరించారు. ఉత్తరాఖండ్‌లోని పర్వత ప్రాంతాల్లో లభించే ఆహార ఉత్పత్తులు, స్థానిక వ్యవసాయ ప్రత్యేకతలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో వీటిని అందించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.మరోవైపు, హరిద్వార్‌లో 2027లో జరగనున్న కుంభమేళాకు గుర్తుగా గంగమ్మ ప్రతిరూపాన్ని కూడా ప్రధాని మోదీకి అందజేశారు. గంగా నది పవిత్రత, హరిద్వార్ కుంభమేళా వైభవాన్ని ప్రతిబింబించేలా ఈ ప్రతిరూపాన్ని రూపొందించారు. కుంభమేళా నేపథ్యంలో ఉత్తరాఖండ్ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను ఈ కానుక చాటిచెప్పింది. ప్రధానమంత్రితో జరిగిన ఈ సమావేశంలో ఉత్తరాఖండ్‌కు చెందిన స్థానిక ఉత్పత్తులు, సంప్రదాయ కళలు, ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిచయం చేయడం ప్రధాన అంశంగా నిలిచింది. రాష్ట్రంలోని ప్రత్యేక ఉత్పత్తులను జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది.

ఏపీఎండీసీని అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దడంపై సీఎం సమీక్ష



ఇప్పటివరకు గుర్తించిన ఖనిజ వనరులతోపాటు కొత్తగా వెలుగులోకి వచ్చే నిక్షేపాలను కూడా సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని పరిశీలించారు. ఖనిజ సంపదను గుర్తించడం నుంచి దాని వినియోగం వరకు పటిష్టమైన విధానం ఉండేలా చర్యలు తీసుకోవాలని సమీక్షలో ప్రస్తావించారు.ఖనిజాల నిర్వహణ, అభివృద్ధి కోసం ప్రత్యేక సంస్థ అవసరమనే అంశంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఇందులో భాగంగా ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్ఈడీసీ) ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో లభ్యమయ్యే అరుదైన ఖనిజాల గుర్తింపు, నిర్వహణ, వాటి వనరులను సమర్థంగా వినియోగించుకునే దిశగా ఈ సంస్థ కీలక పాత్ర పోషించనుంది. ప్రత్యేక సంస్థ ఏర్పాటు ద్వారా ఈ రంగానికి సంబంధించి కార్యాచరణను మరింత వ్యవస్థీకృతం చేసే అవకాశం ఉంటుంది.ఏపీఎండీసీని ఉన్నత స్థాయి సంస్థగా అభివృద్ధి చేయడం, కొత్త ఖనిజ నిక్షేపాలను వెలికితీయడం, అరుదైన ఖనిజాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి అంశాలు రాష్ట్ర మైనింగ్ రంగానికి ప్రాధాన్యత కలిగినవిగా భావిస్తున్నారు. ఖనిజ వనరులపై సమగ్ర అవగాహనతో ప్రణాళికలు రూపొందిస్తే వాటి ద్వారా రాష్ట్రానికి ఆర్థికంగా మరింత ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మైనింగ్ శాఖ చేపట్టాల్సిన తదుపరి చర్యలపై సమీక్షలో చర్చించారు. రాష్ట్రంలోని ఖనిజ సంపదను కేవలం గుర్తించడమే కాకుండా, దాని విలువను పెంచే విధంగా వినియోగించుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు ఈ సమీక్ష ద్వారా స్పష్టమవుతోంది. ఏపీఎండీసీ బలోపేతం, కొత్త నిక్షేపాల అన్వేషణ, ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా మైనింగ్ రంగంలో ప్రత్యేక కార్యాచరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆయా నిర్ణయాలు కార్యరూపం దాల్చితే రాష్ట్ర ఖనిజ రంగ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి.

జడ్పీ చైర్‌పర్సన్‌గా కారికాన భవానీకి మంత్రి అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు

- నేడు అధికారికంగా బాధ్యతల స్వీకరణ
- నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ
- జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచన



శ్రీకాకుళం, రాజధాని వాయిస్ : శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్స న్‌గా కూటమి తరఫున జనసేన పార్టీ నుంచి నియమితులైన కొరికాన భవానీకి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నేడు అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో కొరికాన భవానీ, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు. ఈ సందర్భం గా వారిని మంత్రి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా పరిషత్ పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని అచ్చెన్నా యుడు కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి అర్హులకూ అన్యా యం జరగకుండా చూడాలని సూచించారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులకు కూడా సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి సూచించారు. తాగునీరు, రహదారులు, ఇతర ప్రజావసరాలకు సంబంధిం చిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవా లని ఆకాంక్షించారు. అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తూ జిల్లా పరిషత్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం ఎంతో ముఖ్య మని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను ఎప్పటిక ప్పుడు తెలుసుకుంటూ వారికి మెరుగైన పాలన అందించాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న కొరికాన భవానీ తనకు అప్పగించిన కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల విశ్వాసం, మన్ననలు పొందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

వైఎస్ అవినాశ్ రెడ్డి కాన్వాయ్‌పై దాడి.. వాహనం ధ్వంసం

సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఎంపీ వర్గాలు తెలిపాయి. కాన్వాయ్‌పై ప్రత్యర్థులు ఒక్కసారిగా రాళ్లు, కర్రలు, పెట్రోల్ బాంబులతో దాడికి దిగినట్లు అవినాశ్ రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనలో కాన్వాయ్‌లోని ఒక వాహనం ధ్వంసమైనట్లు వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు వెళ్తున్న తమను అడ్డుకుని దాడికి పాల్పడ్డారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో అంకలమ్మ గూడూరు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దాడి వెనుక టీడీపీ నేత బీటెక్ రవి ఉన్నారని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. కేవలం ఐదు వాహనాలతోనే తాము ప్రయాణించామని, ముందుగానే సీఐ, ఎస్ఐలకు సమాచారం అందించామని చెప్పారు. అయినప్పటికీ బీటెక్ రవి ఆధ్వర్యంలోనే దాడి జరిగిందని, పెట్రోల్ బాంబులతో కూడా దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. పోలీసుల సమక్షంలోనే ఈ ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు.నామినేషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య ప్రక్రియకు విఘాతం కలిగించడమేనని ఎంపీ వ్యాఖ్యానించారు. దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పైగా దాడికి గురైన వారిపైనే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపిస్తూ పోలీసుల వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం ఉనికి ఉందా లేదా అని అవినాశ్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు, రాజకీయ నాయకులు స్వేచ్ఛగా నామినేషన్ల ప్రక్రియలో పాల్గొనే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అయితే ఈ ఘటనపై పోలీసుల అధికారిక స్పందన, దాడికి సంబంధించిన పూర్తి వివరాలు, ఇరువర్గాల వాదనలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది.

కొనకళ్ల నారాయణరావును పరామర్శించిన మంత్రి పార్థసారథి

అమరావతి, రాజధాని వాయిస్ : మాజీ పార్లమెంటు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించారు. అనారోగ్య కారణాలతో ఆయన మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మంత్రి ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణరావుకు అందుతున్న వైద్య చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వర్గాలు, కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆకాంక్షించారు. ఆసుపత్రిలో ఉన్న కొనకళ్ల నారాయణరావు కుటుంబ సభ్యులతోనూ మంత్రి కొద్దిసేపు మాట్లాడారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఆయన ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.కొనకళ్ల నారాయణరావు త్వరగా కోలుకోవాలని, తిరిగి సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని పార్థసారథి ఆకాంక్షించారు. ప్రజా జీవితంలో చురుకుగా కొనసాగుతూ మళ్లీ ప్రజాసేవలో పాల్గొనాలని కోరుకున్నారు. మాజీ ఎంపీగా, ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కొనకళ్ల నారాయణరావు ఆరోగ్య పరిస్థితిపై మంత్రి పరామర్శించడం రాజకీయ, ప్రజా వర్గాల్లో ప్రాధాన్యం



సంతరించుకుంది. ఆయన త్వరగా కోలుకోవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

అర్నబ్, మురసు తుపానుల విధ్వంసం..

తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ముఖ్యంగా అర్నబ్ తుఫా ను ప్రభావంతో 215 మండలాల్లోని 23,211 హెక్టార్లలో తోట లు నాశనమయ్యాయని, ఇందులో ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో నేలమట్టమైందని తెలిపారు. అలాగే మురసు తుఫాను ప్రభావంతో 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని వెల్లడించారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర పథకాల ద్వారా తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి కోరారు. తీవ్రంగా నష్టపోయిన అరటి తోటల పునరుద్ధరణ కోసం 'మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్' స్కీమ్ కింద హెక్టారుకు రూ.44 వేల చొప్పున నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన' కింద ఎండుమి ర్చి, కూరగాయల పంటల రైతులకు అండగా నిలవాలని కోరారు. కోనసీమ, కాకినాడ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు 'కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు' ద్వారా ఆర్థిక సహకారం అందించాలని లేఖలో విన్నవించారు. రైతులకు దీర్ఘకాలిక నష్టాలను తగ్గించేందుకు ఈ సాయాన్ని త్వరితగతిన విడుదల చేయాలని చంద్రబాబు కోరారు.

మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కిమ్స్‌కు కొనకళ్ల నారాయణ తరలింపు

అమరావతి, రాజధాని వాయిస్ : అస్వస్థతకు గురై ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న ఏపీ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత కొనకళ్ల నారాయణ ఆరోగ్య పరిస్థితిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. కొనకళ్ల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన ముఖ్యమంత్రి, ఆయన తాజా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం కొనకళ్ల నారాయణకు అందుతున్న వైద్యం గురించి కుటుంబ సభ్యులను సీఎం చంద్రబా బు వివరాలు అడిగారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను మణిపా ల్ ఆసుపత్రి నుంచి హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలిస్తున్న ట్లు కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని సీఎం వారికి భరోసా ఇచ్చారు. కొనకళ్ల నారా యణ త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు.కొనకళ్ల నారాయణను హైదరాబాద్‌కు తరలిస్తున్నారన్న సమాచారంతో సీఎం చంద్రబాబు వెంటనే కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యంతో కూడా ఫోన్లో మాట్లాడారు. కొనకళ్ల నారాయణ చేరగానే ఆయనకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన చికిత్స అందించేందుకు అవసరమై న అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆసుపత్రి వైద్యులకు, యాజమా న్యానికి ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.కొనకళ్ల నారాయణరావు ఈ ఉదయం హఠాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. ఉదయం ఆయనకు తీవ్రంగా కళ్లు తిరగడంతో కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన వైద్యులు, ఆయన బ్రెయిన్‌లో రక్తపు గడ్డ (క్లాట్) ఉన్నట్లు గుర్తించారని సమాచారం. దీంతో మెరుగైన వైద్యం కోసం ఆయనను హుటాహుటిన విజయవాడలోని ఆస్పత్రికి తరలించారు.

సత్యసాయి జడ్పీ చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్..
కాకినాడలో ఆసక్తికర పరిణామం



కాకినాడ, రాజధాని వాయిస్ : రాష్ట్రంలో జిల్లా పరిషత్ నూతన పాలకమండళ్లు కొలువుదీరాయి. కొత్తగా ఎన్నికైన జడ్పీటీసీలతో ప్రమాణ స్వీకారం చేయించిన అధికారులు.. జడ్పీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేశారు. శ్రీసత్యసాయి జిల్లా తొలి జడ్పీ ఛైర్మన్‌గా పరిటాల శ్రీరామ్ ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నల్లచెరువు జడ్పీటీసీ స్థానం నుంచి తెదేపా అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించారు. పలు ఊహాగానాల మధ్య ఉత్కంఠకు తెరతీస్తూ పరిటాల శ్రీరామ్ పేరును ప్రకటించారు. పరిటాల రవీంద్ర వారసుడైన శ్రీరామ్ రాజకీయ ప్రస్థానం ఈ పదవితో కీలక మలుపు తిరిగింది. ఇప్పటికే ధర్మవరం తెదేపా ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీరామ్‌కు జడ్పీ ఛైర్మన్ పీఠం దక్కడంపై పార్టీ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాణస్వీకారానికి దూరంగా పిల్లి అనంతలక్ష్మి..

కాకినాడ జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ ఎంపిక వ్యవహారం ఆసక్తికరంగా మారింది. ఛైర్‌పర్సన్ పదవిని ఆశించిన తెదేపా జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి అనంతలక్ష్మికి.. వైస్ ఛైర్‌పర్సన్ పదవి కేటాయించడంతో ఆమె అసంతృప్తికి గురయ్యారు. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్.. అనంతలక్ష్మి నివాసానికి వెళ్లి మాట్లాడారు. కూటమి నాయకత్వం నిర్ణయాన్ని గౌరవించాలని నచ్చజెప్పారు. దీంతో వారి విజ్ఞప్తికి అంగీకరించిన పిల్లి అనంతలక్ష్మి.. జడ్పీ సమావేశానికి హాజరయ్యారు. అయితే, కొద్దిసేపు సమావేశ మందిరంలో కూర్చున్న ఆమె.. జడ్పీటీసీగా కూడా ప్రమాణస్వీకారం చేయకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. వైస్ ఛైర్‌పర్సన్ పదవి కేటాయింపుపై అసంతృప్తితో ఉన్న అనంతలక్ష్మి.. చివరకు ప్రమాణస్వీకారానికి కూడా దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

ఏపీలో చిన్న అణు రియాక్టర్లతో విద్యుత్
ఎస్ఎంఆర్ సాంకేతికతపై ప్రభుత్వ దృష్టి

అమరావతి,రాజధాని వాయిస్ : థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా అత్యాధునిక అణు విద్యుత్ ఉత్పత్తి వైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ సాంకేతికత ఆధారంగా రాష్ట్రంలో అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించేందుకు ప్రభుత్వం శుక్రవారం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) జారీ చేశారు.కాలం చెల్లి పదవీ విరమణకు చేరువైన థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థానాల్లో లేదా రాష్ట్రంలోని ఇతర అనువైన ప్రాంతాల్లో ఈ సాంకేతికత స్థిరపడిన తర్వాత ఎస్ఎమ్ఆర్ ఆధారిత అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్రం యోచిస్తోంది. ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనను సమగ్రంగా పరిశీలించిన తర్వాత ప్రభుత్వం ఈ మేరకు అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుల్లో ప్రభుత్వ భాగస్వామ్యంతో పాటు ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వామ్యం చేసేందుకు పచ్చజెండా ఊపారు.కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు నిరంతర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఈ సరికొత్త న్యూక్లియర్ టెక్నాలజీ భవిష్యత్తులో అత్యంత కీలక పాత్ర పోషించనుంది. తక్కువ విస్తీర్ణంలో, సురక్షితమైన ఆధునిక ప్రమాణాలతో విద్యుత్ ఉత్పత్తిని అందించే ఈ ఎస్ఎమ్ఆర్ విధానాన్ని అమల్లోకి తేవడం ద్వారా రాష్ట్ర ఇంధన భద్రతను పటిష్టం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

బర్డ్ ఫ్లూకు చెక్ పెట్టేలా
స్వదేశీ వ్యాక్సిన్ అందుబాటులోకి!



వేగంగా వ్యాప్తి చెందుతుంది. కొన్ని సందర్భాల్లో వ్యాధి సోకిన పక్షుల్లో మరణాల రేటు అధికంగా ఉంటుంది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభావిత ప్రాంతాల్లో పక్షుల తరలింపుపై ఆంక్షలు, పారిశుద్ధ్య చర్యలు, ఇతర నియంత్రణ చర్యలు చేపట్టాల్సి వస్తుంది. దీంతో కోళ్ల పెంపకందా రులు, పౌల్ట్రీ వ్యాపారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ వ్యాప్తి కారణంగా కోళ్ల పరిశ్రమ భారీ నష్టాలను చవిచూసింది.

పౌల్ట్రీ రంగానికి ఊరట

దేశంలో పౌల్ట్రీ పరిశ్రమ లక్షలాది మంది రైతులు, వ్యాపారులు, కార్మికులకు ఉపాధి కల్పిస్తోంది. కోళ్ల పెంపకం ద్వారా గుడ్లు, మాంసం ఉత్పత్తి జరుగుతూ ప్రజల ఆహార అవసరాలు తీరుతున్నాయి. అయితే బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందితే కోళ్ల మరణాలతో పాటు ముందస్తు నియంత్రణ చర్యల్లో భాగంగా పక్షులను తొలగించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఫలితంగా రైతులు పెట్టుబడులు కోల్పోవడంతో పాటు పౌల్ట్రీ ఉత్పత్తుల సరఫరాపైనా ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో దేశీయంగా అభివృద్ధి చేసిన వ్యాక్సిన్ పౌల్ట్రీ రంగానికి ఎంతో ఉపయోగకరంగా మారుతుందని భావిస్తున్నారు.

శాస్త్రవేత్తలకు మంత్రి అభినందనలు

వ్యాక్సిన్ ఆవిష్కరణ సందర్భంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. దేశీయంగా బర్డ్ ఫ్లూ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడం పౌల్ట్రీ రంగ పరిరక్షణలో కీలక ముందడుగు అని పేర్కొన్నారు. కోళ్ల పెంపకందారుల జీవనోపాధిని బలోపేతం చేయడంతో పాటు పౌల్ట్రీ పరిశ్రమకు భరోసా కల్పించడంలో ఈ టీకా దోహదపడుతుందని తెలిపారు. ఈ వ్యాక్సిన్ అభివృద్ధికి కృషి చేసిన శాస్త్రవేత్తలు, పరిశోధకులను అభినందించారు.

స్వదేశీ పరిశోధనలకు ప్రోత్సాహం

విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా దేశీయ పరిశోధనా సంస్థల ద్వారా కీలక వ్యాధులకు వ్యాక్సిన్లు అభివృద్ధి చేయడం భారత శాస్త్రసాంకేతిక రంగానికి గర్వకారణంగా నిలుస్తోంది. బర్డ్ ఫ్లూ వంటి ప్రమాదకర వైరస్‌లను ఎదుర్కొనేందుకు స్వదేశీ టీకా అందుబాటులోకి రావడం పౌల్ట్రీ రంగంలో వ్యాధి నియంత్రణకు కొత్త అవకాశాలను కల్పించనుంది. అయితే వ్యాక్సిన్ వినియోగం, పంపిణీ, అమలు విధానం సంబంధిత ప్రభుత్వ మార్గదర్శకాలు, పశుసంవర్ధక శాఖ సూచనలకు అనుగుణంగా ఉండనున్నాయి. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ హెచ్5ఎన్1 వ్యాక్సిన్ పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు కోళ్ల పెంపకందారులకు ఆర్థిక భద్రత కల్పించే దిశగా కీలకంగా మారనుందని నిపుణులు భావిస్తున్నారు.

కాటమరాజు జయంతిని రాష్ట్ర పండుగ గా.. రాయల జయంతిని శౌర్య దివస్ గా ప్రకటించాలి

సీఎం చంద్రబాబు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు బోడె రామచంద్రయాదవ్ లేఖలు

అమరావతి.నవంబర్ 20 రాజధాని వాయిస్ : వీర కాటమరాజు జయంతిని ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర పండుగ గా అధికారికంగా నిర్వహించాలని, శ్రీకృష్ణదేవరాయల జయంతిని దేశవ్యాప్తంగా శౌర్య దివస్ గా ప్రకటించాలని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు వేర్వేరుగా లేఖలు రాశారు.బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడి, నేటికీ ప్రజలచేత భక్తిశ్రద్ధలతో జాతర జరిపించుకునే ఏకైక రాజు కాటమరాజు అని ఆయన కొనియాడారు. ఓటమి ఎరుగని ధీరుడు శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన దేవాలయాలు, తవ్వించిన చెరువులు నేటికీ మన సంస్కృతికి, సాగునీటి రంగానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని రామచంద్రయాదవ్ తన లేఖల్లో విజ్ఞప్తి చేశారు.

అమరావతిలో సెబీ కార్యాలయం.. 1.78 ఎకరాల భూమి కేటాయింపు

అమరావతి,రాజధాని వాయిస్ : ప్రజారాజధాని అమరావతిలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) కార్యాలయం ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి శుక్రవారం లీజు ఒప్పందం పూర్తయింది. అమరావతిలోని నేలపాడు ప్రాంతంలో సెబీ కార్యాలయ నిర్మాణం కోసం ఏపీసీఆర్డీఏ (APCRDA) 1.78 ఎకరాల భూమిని కేటాయించింది.ఈ మేరకు నవంబర్ 20న సంబంధిత లీజు ఒప్పంద పత్రాలను ఏపీసీఆర్డీఏ ఎస్టేట్స్ విభాగం జాయింట్ డైరెక్టర్ జుబిన్ రాయ్, సెబీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.వి.ఎన్. సూర్యకుమార్‌కు అందజేశారు.సెబీ కార్యాలయంతో పాటు అమరావతిలో అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో కూడిన డేటా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా ప్రాంతీయ శిక్షణ, నాయకత్వ అభివృద్ధి కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఈ కేంద్రం ద్వారా శిక్షణ తరగతులు, మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ (MDP) నిర్వహించనున్నట్లు సెబీ అధికారులు వెల్లడించారు.నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ (NISM) సహకారంతో పరీక్షా కేంద్రాన్ని సైతం ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల



ఆర్థిక రంగానికి సంబంధించిన శిక్షణ, పరీక్షలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు అమరావతి వేదిక కానుంది. సెబీ కార్యాలయం, డేటా సెంటర్, శిక్షణ కేంద్రం ఏర్పాటుతో రాజధానిలో ఆర్థిక సేవల రంగానికి సంబంధించిన కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంది. జాతీయ స్థాయి సంస్థల ఏర్పాటుతో అమరావతిలో ఆర్థిక, సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి రంగాలకు కొత్త అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

రెండో విడత పంచాయతీ నామినేషన్లు ప్రశాంతం

తుళ్లూరు, సౌత్ సబ్ డివిజన్లలో మూడో విడత నామినేషన్లకు పటిష్ట బందోబస్తు

గుంటూరు, రాజధాని వాయిస్ : గుంటూరు జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ తెలిపారు. పోలీసు అధికారుల నిరంతర పర్యవేక్షణతో నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో తుళ్లూరు, సౌత్ సబ్ డివిజన్ల పరిధిలోని గ్రామ పంచాయతీలు, వార్డుల నామినేషన్ కేంద్రాల వద్ద తగిన సంఖ్యలో పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా రద్దీ నియంత్రణ, బారికేడింగ్, ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.డీఎస్పీ స్థాయి అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించడంతో పాటు సీఐలు, ఎస్ఐలు నామినేషన్ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించారు. గతంలో ఘర్షణలు చోటుచేసుకున్న గ్రామాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గస్తీ, మొబైల్ పెట్రోలింగ్ నిర్వహించారు. నామినేషన్లు వేయకుండా అభ్యర్థులను బెదిరించడం, ఒత్తిడికి గురిచేయడం, అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు



సంయమనం పాటిస్తూ ప్రజాస్వామ్యబ ద్ధంగా ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని సూచించారు.ఇదిలా ఉండగా, గుంటూరు నగరంలో నిర్వహించిన జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక కూడా పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. మూడో విడత నామినేషన్ల ప్రక్రియను కూడా ప్రశాం తంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

ప్రజలకు విజ్ఞప్తి: పోలీసు అత్యవసర సహాయం కోసం డయల్ 112 లేదా 100 నంబర్లకు ఫోన్ చేయాలని, సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందిస్తారని ఎస్పీ తెలిపారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమమే శాఖ ప్రాధాన్యం

ప్రతి సమస్యకు నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కారం: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, రాజధాని వాయిస్ : పోలీస్ సిబ్బంది సంక్షేమా నికి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, సిబ్బంది ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను శాఖ నిబంధనల మేరకు వీలైనం త త్వరగా పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ తెలిపారు.గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శు క్రవారం నిర్వహించిన పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో పనిచే స్తున్న సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. వ్యక్తిగత, సర్వీసు సంబంధిత సమస్యలు, బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు, ఇతర పరిపాలనా అంశాలపై సిబ్బంది తమ సమ స్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి వినతిని స్వయంగా పరిశీలించిన ఎస్పీ, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించేం దుకు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. బదిలీలు, పదోన్నతులు, ఇతర పరిపాలనా నిర్ణయాలను ఖాళీలు, శాఖ అవసరాలు, నిబంధనలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా చేపడతామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సిబ్బంది సమస్యలు సకాలంలో పరిష్కారమైతే విధి నిర్వహణలో మరింత ఉత్సాహం, సామర్థ్యం, నిబద్ధత పెరుగుతాయని పేర్కొన్నారు. ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచిం చారు. సిబ్బంది సంక్షేమం



మెరుగుపడితేనే ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించగలమన్నారు.ప్రతి పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, అంకిత భావంతో వ్యవహరించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలు గుతూ పోలీసు శాఖపై విశ్వాసాన్ని పెంపొందించాలని సూచిం చారు. పోలీసు శాఖ ఒక కుటుంబమని, పరస్పర సహకారం, సమన్వయం, గౌరవంతో పనిచేసినప్పుడే సంస్థ మరింత బలోపే తం అవుతుందని ఎస్పీ పేర్కొన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పల్నాడు జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

పల్నాడు, రాజధాని వాయిస్ : జిల్లాలో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టనుంది. చిలకలూరిపేట, గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలోని 12 మండలాల్లో మూడో విడత ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు.ఈ నెల నవంబర్ 21 నుంచి 23వ తేదీ వరకు ఆయా మండలాల్లోని గ్రామ పంచాయతీలు, వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ చేపట్టనున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి పోలింగ్ వరకు ప్రతి దశను అధికారులు పర్యవేక్షించనున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచడం తో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు తావులేకుండా పోలీసు బృందాలను అప్రమత్తం చేయనున్నారు.మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు డిసెంబర్ 2న నిర్వహించనున్నారు. ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు.ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ అధికారులకు సహకరించాలని, ఎలాంటి ప్రలోభాలకు, వివాదాలకు, ఘర్షణలకు తావులేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు.

జడ్పీ చైర్‌పర్సన్‌గా డి. అరుణ, వైస్ చైర్‌పర్సన్‌గా టి. అశోక్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

13 మంది నూతన జడ్పీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన కలెక్టర్ సాయికాంత్ వర్మ





గుంటూరు, రాజధాని వాయిస్ : గుంటూరు జిల్లా పరిషత్ నూతన చైర్‌పర్సన్‌గా డి. అరుణ, వైస్ చైర్‌పర్సన్‌గా టి. అశోక్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నిర్వహించిన జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశంలో జిల్లా కలెక్టర్, ప్రిసైడింగ్ అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ నూతనంగా ఎన్నికైన 13 మంది జడ్పీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఈ పదవులకు ఇతర అభ్యర్థులు పోటీలో లేకపోవడంతో డి. అరుణ, టి. అశోక్ కుమార్ ఏకగ్రీవం గా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. అనంతరం నూతన చైర్‌ప ర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో ఆయన ప్రమాణ స్వీకారం చేయిం చారు.ఈ సందర్భంగా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జడ్పీటీసీ సభ్యులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్‌ను సమర్థవంతమైన వేదికగా వినియోగించుకోవాల న్నారు.ప్రజాప్రతి నిధులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ గుంటూరు జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిం చారు. నూత నంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు జడ్పీటీసీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమ ంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జ్యోతిబసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల అక్షరాస్యత పోటీల్లో ప్రతిభ చూపిన 20 మంది విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు

ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యం

పల్నాడు, రాజధాని వాయిస్ : విద్యార్థుల్లో ఎన్నికల ప్రక్రి యపై అవగాహన పెంపొందించడంతో పాటు ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్య విలువలపై చైతన్యం కల్పించే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ (ELC--2026) కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యా ర్థులకు పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ కృతికా శు క్లా, ఐఏఎస్ ప్రశంసా పత్రాలు అందజేశారు. శుక్రవారం నవంబర్ 20న కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు అవగాహన కార్యక్రమం సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (SVEEP)లో భాగంగా ఈ పోటీలను నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే ఎన్నికల వ్యవస్థపై సరైన అవగాహన కల్పించడం, ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా ప్రోత్స హించడం, ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన విధానాలు, ఓటింగ్ ప్రక్రియ గురించి తెలియజేయడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశం. అదేవిధంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల పాత్ర, బాధ్యతలు, రాజ్యాంగ విలువలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్ పోటీలను మూడు దశల్లో నిర్వహించారు. తొలుత పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో జిల్లావ్యాప్తంగా 25,330 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 1,192 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. చివరి గా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 140 మంది విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలపై తమ పరిజ్ఞానాన్ని చాటుకు న్నారు. ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం, ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల సంఘం విధులు తదితర అంశాలపై విద్యార్థులకు ఉన్న అవగాహనను పరీక్షించే విధంగా



పోటీలను నిర్వహించారు. మూడు దశల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన 20 మందిని ఎంపిక చేసి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా విద్యార్థులను అభినందించారు. విద్యా ర్థులు చదువుతో పాటు సమాజం, ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఉన్న ముఖ్యమైన ప్రజాస్వామ్య హక్కు అని, దానిని బాధ్యతతో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఎన్నికల అక్షరాస్యత క్లబ్‌ల ద్వారా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఎన్నికల విధానాలు, ఓటరు హక్కులు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించడం వల్ల భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు దోహద పడుతుందని పేర్కొన్నారు.జిల్లావ్యాప్తంగా మూడు దశల్లో మొత్తం 26,662 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడం కార్యక్రమం పట్ల విద్యార్థుల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది. ఇటువంటి కార్యక్రమాల ద్వారా యువతలో ఎన్నికల అక్షరాస్యతను పెంపొం దించి, ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకైన భాగస్వాములుగా తీర్చి దిద్దేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రిపై వైభవంగా బిల్వార్చన, సహస్ర లింగార్చన

కార్తీక మాసం సందర్భంగా శ్రీ మల్లేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు.. భక్తిశ్రద్ధలతో ఆకాశదీపం, సహస్ర దీపాలంకరణ

విజయవాడ, రాజధాని వాయిస్ : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా స్వామివారికి బిల్వార్చన, సహస్ర లింగార్చన, ఆకాశదీపం, సహస్ర దీపాలంక రణ, ఊయల సేవ తదితర విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వ హించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. దీపాలంకరణలతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు. స్థానాచా ర్యులు వి. శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ పూజా క్రతువులను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్తీక మాసంలో శివారాధనకు విశేష ప్రాధాన్యత ఉండటంతో భక్తులు భక్తిపారవశ్యంతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్



బొర్రా రాధాకృష్ణ (గాంధీ) పాల్గొని శ్రీ మల్లేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు పొందారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు పద్మావతి ఠాకూర్, సరిత తదితరులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్తీక మాస వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ విశేష పూజా కార్యక్రమాలు ఇంద్రకీలాద్రిపై భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక వాతావర ణాన్ని మరింత పెంపొందించాయి.

కొండపల్లి బొమ్మల పునరుజ్జీవనానికి నీతి ఆయోగ్ బాసట

విజయవాడ, రాజధాని వాయిస్ : ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ కళా వైభవానికి ప్రతీకగా నిలిచిన కొండపల్లి బొమ్మల తయారీ పరిశ్రమకు పునరుజ్జీవం కల్పించేందుకు నీతి ఆయోగ్ అండగా నిలిచింది. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, ఐఏఎస్ ప్రత్యేక చొరవతో నీతి ఆయోగ్ ఆకాంక్షిత బ్లాకుల అభివృద్ధి కార్యక్రమం కింద కొండపల్లి బొమ్మల పునరుజ్జీవనం, ప్రోత్సాహానికి రూ. 20 లక్షల ప్రత్యేక ప్రాజెక్టు కు ఆమోదం లభించింది.ఇబ్రహీంపట్నం మండలంలో ఏడాది పాటు ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. దీని ద్వారా స్థానికంగా కొండ పల్లి బొమ్మల తయారీపై ఆధారపడి జీవిస్తున్న 420 మంది కళాకారు లకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. అంతరించిపోతున్న సంప్రదాయ కళను పరిరక్షించడంతో పాటు కళాకారులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి ఆదాయాన్ని పెంపొందించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా నిర్దేశించారు.

ఆధునిక మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి ఈ ప్రాజెక్టులో భాగంగా కొండపల్లి బొమ్మల తయారీలో నిమగ్నమైన కళాకారులకు ఆధునిక పద్ధతుల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించనున్నారు. బొమ్మలకు ప్రత్యేక బ్రాండింగ్ కల్పించడం, పర్యావరణహిత ప్యాకేజింగ్ విధానాలను ప్రోత్సహించడం, డిజిటల్ మార్కెటింగ్ ద్వారా విస్తృత ప్రచారం కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. అదేవిధంగా ఆన్‌లైన్ విక్రయాలకు అవసరమైన అవకాశాలను కల్పించడంతో పాటు వివిధ మార్కెట్లతో కళాకారులకు అనుసంధానం చేయనున్నారు. దీనివల్ల కొండపల్లి బొమ్మలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంటుంది. మధ్యవర్తులపై ఆధారపడకు ండా కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరవేసుకునేందుకు కూడా ఈ విధానం దోహదపడనుంది.

సంప్రదాయానికి ఆధునికత జోడింపు

కొండపల్లి బొమ్మలు తరతరాలుగా కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళా సంపదలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి. ప్రత్యేకమైన చెక్కతో, నైపుణ్యంతో రూపొందించే ఈ బొమ్మలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి.

నకరికల్లు సర్పంచ్ అభ్యర్థిగా తిరువీధుల శ్రీనివాసరావు

- నామినేషన్ దాఖలు



నకరికల్లు.నవంబర్ 20 రాజధాని వాయిస్ : నకరికల్లు గ్రామ సర్పంచ్ పదవికి కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన తిరువీధుల శ్రీనివాసరావు శుక్రవారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.నామినేషన్ కార్యక్రమానికి ముందు గ్రామంలోని ఆలయాల ను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల కార్యాలయానికి చేరుకుని ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు.గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, కేవలం ఎన్నికల్లో గెలవడమే కాకుండా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళలలు తదితరులు పాల్గొన్నారు.

రథంపై ఊరేగింపుగా వెళ్లి సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ దాఖలు



రాజుపాలెం.నవంబర్ 20రాజధాని వాయిస్: మండలంలోని కొండమోడు గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ అభ్యర్థిగా ఓర్సు కోటేశ్వరరావు మాజీ సర్పంచ్ వేముల నాగమణి విశ్వనాథం మద్దతుతో రథంపై ఊరేగింపుగా బైక్ ర్యాలీ నిర్వహించి తన మద్దతు దారులు మరియు 12 మంది వార్డు మెంబర్ లతో కలిసి పెద నెమలి పూరి సచివాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.ఒక సర్పంచ్ అభ్యర్థి రథం పై ఊరేగింపుగా వెళ్లి నామినేషన్ వేయడం చాలా అరుదుగా కనిపిస్తుంది.అద్దంకి నార్కెట్పల్లి రహదారిలో రథం వెళ్లుతూ ఉంటే ప్రయాణికులు చూపు రథం వైపు మళ్లింది.తెలుగుదేశం పార్టీ మద్దతుతో నామినేషన్ దాఖలు చేసినట్టు మీడియాకు తెలియజేశారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు శుభాకాంక్షలు

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్ల.నవంబర్ 20 రాజధాని వాయిస్ : నియోజకవర్గ పరిధిలో విజయం సాధించిన కూటమి పార్టీల ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానం దరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం నరసరావుపేట జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన జెడ్పీటీసీల ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొని, కారంపూడి జెడ్పీటీసీ డాక్టర్ కొండపల్లి శివకుమారి నాగేశ్వరరావు, దుర్గి జెడ్పీటీసీ బృంగా నాగజ్యోతి నాగేంద్రవర్మ, రెంటచింతల జెడ్పీటీసీ మున్నా నాగేంద్రమ్మ ప్రభురాజు, మాచర్ల జెడ్పీటీసీ గుండాల శ్రీనివాసరావు యాదవ్, వెల్దుర్తి జెడ్పీటీసీ బత్తుల అంకమరావు లకు శుభాకాంక్షలు తెలియజేసి, సన్మానించారు.అలానే జిల్లా పరిషత్ చైర్పర్సన్ గా పదవీ బాధ్యతల ప్రమాణస్వీకారం చేసిన పుచ్చకాయల రమాదేవి బసవేశ్వరరావు, వైస్ చైర్పర్సన్ నల్లపాటి కీర్తన లకు సన్మానించి అభినందించారు. కూటమి ప్రభుత్వంలో ఉన్నతమైన పదవీ బాధ్యతలు స్వీకరించిన సభ్యులందరూ గ్రామీణాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సరికొత్త బాటలు వేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

ఆధునిక దేవాలయాలు గ్రంథాలయాలు

డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి



మాచర్ల.నవంబర్ 20రాజధాని వాయిస్ : ఆధునిక దేవాలయాలు గ్రంథాలయాలని శ్రీకృష్ణ జనరల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం59 వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభకు రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మాచర్ల శాఖ గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి మాచర్ల మెర్సీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సమగ్ర సమాచారం అందించేవి పుస్తకాలని,గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదివి ఎంతోమంది గొప్ప విజయాలుసాధించారన్నారు . పుస్తకాలు మనిషికి నిజమైన నేస్తాలని పఠనం ద్వారా జ్ఞానం, విజ్ఞానం, వ్యక్తిత్వం, వికాసం పెరుగుతాయన్నారు. మాతృభాషపై అభిమానం పెంపొందించుకోవాలని విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు.ఈ నెల 14 నుండి 20 వ తేదీ వరకు జరిగిన కార్యక్రమాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు గుర్రం రాజశేఖర్ రెడ్డి మెమెంటులుఅందజేశారుఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం స్వరూప, అధ్యాపకులు కేలం ఆదినారాయణ, శ్రీనివాసరావు, వాసవి క్లబ్ రీజియన్ ఓరుగంటి చెన్నకేశవరావు,గెల్లిపోగు మోహన రావు, లైన్స్ క్లబ్ పాస్ట్ రీజియన్ చైర్మన్ కొమరనాగేశ్వరావు , లైన్స్ క్లబ్ సభ్యులు బచ్చు వెంకట సుబ్బారావు,ఎలక్ట్రికల్ శివ, హానీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డియంకు వెల్లువెత్తిన వినతులు



మాచర్ల.నవంబర్ 20 రాజధాని వాయిస్ : మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ సుచరిత మార్గరెట్ శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డియం కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. మొత్తం 23 మంది ఫోన్ ద్వారా సమస్యలను డియం దృష్టికి వచ్చినట్లు తెలిపారు. వాటిల్లో గుంటూరు రోడ్ లోని చెన్నకేశవ నగర్ కాలనీ వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని 2, అడిగొప్పలకు బస్సు ఏర్పాటు చేయాలని 1,నెహ్రూనగర్ తండాకు మరొక సర్వీస్ ఏర్పాటు చేయాలని 1, పట్లవీడుకు ఒక సర్వీస్ పెంచాలని 1, నరసరావుపేటకు ఎక్స్ప్రెస్ బస్సులు ఏర్పాటు చేయాలని 2, గుంటూరుకు నాన్ స్టాప్ బస్సులు ఏర్పాటు చేయాలని 3, కంభంపాడులో రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని 2, మాచర్ల నుండి కర్నూలు సర్వీసును పునరుద్ధరించాలని చేయాలని 10,మాచర్ల నుండి కనిగిరి సర్వీస్ ఏర్పాటు చేయాలని 1, ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రజలనుండి వచ్చిన వెనుతులపై తమ పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని, తమ పరిధిలో లేని సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి కృషి చేస్తానని డియం సుచరిత మార్గరెట్ తెలిపారు.

ముగిసిన గ్రంథాలయం వారోత్సవాలు



దుర్గి.నవంబర్ 20 రాజధాని వాయిస్ :59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈనెల 14వ తేదీ నుండి ప్రారంభమై ఈనాటితో ముగిసినందున ఈ కార్యక్రమం ప్రారంభించామని గ్రంథాలయ అధికారి వేణుగోపి తెలియజేశారు. ఈనాటి ముగింపు కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా తహసీల్దార్ వరకుమార్, ఎంపీడీవో ప్రసాదరావు, ఎంఈఓ 2 బెంజిమెన్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు ఏచూరి రమేష్ బాబు, పాల్గొని పోటీల లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్ వరకుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు సెలవల్లో తప్పకుండా గ్రంథాలయాన్ని వినియోగించుకొని వారి జ్ఞానాన్ని పెంచుకొని జ్ఞానవంతులుగా తయారు కావాలని కోరారు. ఎం.పీ.డీ.వో.ప్రసాద్ రావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి సెల్ఫోన్లకు పరిమితం కాకుండా పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని సంపాదించి మంచి విద్యార్థులుగా మేధావులుగా పేరు తెచ్చుకోవాలన్నారు. ఎం.ఈ. ఓ. టు.బెంజిమెన్ మాట్లాడుతూ, నా చిన్నతనం నుండి గ్రంథాలయం లోని పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పొంది ఈ స్థాయికి ఎదిగానని అన్నారు మీరు కూడా విద్యార్థి దశ నుండి గ్రంథాలయమును ఉపయోగించుకొని పుస్తక పతనం ద్వారా వి జ్ఞానం సంపాదించి గొప్పవారు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజయవంతంగా జరగటానికి సహకరించిన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ వారికి, పాఠశాల ఉపాధ్యాయులు.అబ్బాస్, వై.ఏడుకొండలు,ఎర్రం కొండలు, లక్ష్మీనారాయణకు మీడియా ప్రతినిధులకు, ధన్యవాదాలు తెలుపుతూ గ్రంథాలయ అధికారి ఈ కార్యక్రమాన్ని ముగించారు.

శ్రీ సిమెంట్ యూనిట్‌కు బీఐఎస్ పురస్కారం

- రెండేళ్లుగా సున్నా ఉత్పత్తి వైఫల్యాలో శ్రీ సిమెంట్ కి గుర్తింపు



కారంపూడి నవంబర్20 రాజధాని వాయిస్ : నాణ్యతా ప్రమాణాల అమలు, ఉత్పత్తి నాణ్యత, వినియోగదారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తున్న శ్రీ సిమెంట్ గుంటూరు యూనిట్‌కు అరుదైన గుర్తింపు లభించింది. గత రెండేళ్లుగా ఎలాంటి ఉత్పత్తి వైఫల్యాలు లేకుండా విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహించినందుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) విజయవాడ బ్రాంచ్ కార్యాలయం నుంచి మానక్ వీర్ పురస్కారాన్ని అందుకుంది. భారతదేశం లోని ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థల్లో ఒకటైన శ్రీ సిమెంట్ లిమిటెడ్‌కు చెందిన గుంటూరు యూనిట్ ఈ ఘనత సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో నిర్వహించిన ప్రపంచ ప్రమాణాల దినోత్సవం–2026 వేడుకల్లో భాగంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ సిమెంట్ గుంటూరు యూనిట్ క్వాలిటీ అస్యూరెన్స్ విభాగాధిపతి సతుజోడ్ నేతాజీ రావు బీఐఎస్ విజయవాడ బ్రాంచ్ కార్యాలయ ప్రతినిధుల నుంచి అవార్డును అందుకున్నారు.ఉత్పత్తుల నాణ్యత, భద్రత, విశ్వసనీయతతో పాటు ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో సంస్థ చూపుతున్న నిబద్ధతకు ఈ పురస్కారం నిదర్శనంగా నిలుస్తోంది. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నాణ్యతా ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు.ఈ ఏడాది ప్రపంచ ప్రమాణాల దినోత్సవం ‘మెరుగైన ప్రపంచం కోసం ఉమ్మడి దార్శనికత’ అనే ఇతివృత్తంతో నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం–7 (ఎస్డిజి7) అయిన సరసమైన, స్వచ్ఛమైన ఇంధనంపై ప్రత్యేక దృష్టి సారించారు. సురక్షితమైన, సమ్మిళితమైన, స్థిరమైన ఇంధన వ్యవస్థల అభివృద్ధికి అంతర్జాతీయ ప్రమాణాలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీ సిమెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఉత్పత్తుల తయారీలో, వినియోగదారులకు సేవలు అందించడంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.ఉత్పత్తి ప్రమాణాలను కాపాడుకోవడం, నాణ్యతను నిరంతరం మెరుగుపరచడం, వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ నాణ్యతా ప్రమాణాలను మరింత బలోపేతం చేస్తూ ముందుకు సాగుతామని వెల్లడించారు.బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) భారతదేశ జాతీయ ప్రమాణాల సంస్థగా నాణ్యత, ఉత్పత్తుల ధృవీకరణ, భద్రత, ప్రమాణీకరణకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పరిశ్రమల్లో నాణ్యతా సంస్కృతిని పెంపొందించడంతో పాటు వినియోగదారులకు నమ్మకమైన ఉత్పత్తులు అందేలా కృషి చేస్తోంది.గుంటూరు శ్రీ సిమెంట్ యూనిట్‌కు లభించిన ఈ గుర్తింపు సంస్థ నాణ్యతా నిబద్ధతకు, నిరంతర కృషికి నిదర్శనంగా నిలుస్తోంది.


విశాఖ మేయర్ తండ్రి మృతి పట్ల మంత్రి డోలా సంతాపం

- క్రమశిక్షణ కలిగిన నాయకుడిని టీడీపీ కోల్పోయిందని దిగ్భ్రాంతి



విశాఖపట్నం. నవంబర్ 20 రాజధాని వాయిస్ విశాఖపట్నం నగర మేయర్ ముక్కా శ్రావణి తండ్రి, సీనియర్ నేత ముత్యాలనాయుడు మృతి పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ డోలాబాల వీరాంజనేయస్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మేయర్ ఎన్నిక విజయంతో ఆనందంలో ఉన్న కుటుంబంలో ఇలాంటి విషాదం చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ముత్యాలనాయుడు ఒక నికార్సైన కార్యకర్తగా, వీర విధేయుడిగా పార్టీకి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. గతంలో కార్పొరేటర్‌గా విశాఖ నగర ప్రజలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని గుర్తు చేసుకున్నారు.ముత్యాలనాయుడు మరణంతో క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన ఒక గొప్ప నాయకుడిని టీడీపీ కోల్పోయిందని అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మేయర్ ముక్కా శ్రావణికి, వారి కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

లక్ష్మీపురంలో అభయ ఆంజనేయస్వామికి పిన్నెల్లి ప్రత్యేక పూజలు అన్నదానం ప్రారంభం



కారంపూడి.నవంబర్ 20రాజధాని వాయిస్ : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో పల్నాడు జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో స్వాములకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, ఆలయ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి మానవత్వం చాటుకున్న సీఐ



నరసరావుపేట.నవంబర్ 20రాజధాని వాయిస్ :రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ సాయం అందించి నరసరావుపేట టూ టౌన్ సీఐ ఎ. సురేంద్రబాబు మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం సత్తెనపల్లిలో నామినేషన్ విధుల నిమిత్తం వెళ్తుండగా,ములకలూరు సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో పలువురు గాయపడ్డారు. గమనించిన సీఐ వెంటనే స్పందించి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఆపదలో సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన సీఐ సురేంద్రబాబు సేవాభావంపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com